నిరంకుశత్వం:

# పేను కథ

రచయిత:
* వెల్లంకి రామకృష్ణరావు *

మా అమ్మమ్మమీద యింతా అంతా అని చెప్పలేనంత కోపం వచ్చేసింది. నేను అసలు కోపం తెచ్చుకున్నప్పుడుగానీ, సంతోషపడినప్పుడుగానీ – అందులో పెద్ద విశేషం వుండి తీరుతుంది. పొద్దున్న నిద్రలేచిందగ్గిర్నుంచీ, రాత్రి నిద్రపోయే వరకూ నన్ను అంటిపెట్టుకునివున్న వ్యక్తి ఎవరూ అంటే మా అమ్మమ్మే! పళ్లు తోముకోడానికి 'పళ్లపొడి', కాఫీ తాగడానికి పలక పలకల వెండి గ్లాసూ, భోజనం చెయ్యడానికి తామరాకూ, సాయంత్రం ఆడుకోడానికి మూడు చక్రాల సైకిలూ...ఇవన్నీ ఎవరు చూసేవాళ్ళు? మా...అ...మ్మ...మ్మా! నాకు నిద్ర రావాలీ అంటే కమ్మని కథలు వింటూ పడుకోవాలి. నా అడ్డు ప్రశ్నలు చూసి మా అమ్మగానీ, నాన్నగానీ కథలు చెప్పడం మానేశారు. పాపం, వోపికతోనూ, ఓర్పుతోనూ కథలు చెప్పేది మా అమ్మమ్మే! అయితే నా కెందుకూ కోపం రావడం? పెద్దరాజు అందర్నీ ఓడించేసి, వాళ్లందర్నీ తన 'బానిసలు'గా తయారుచేసుకొని, నిర్లక్ష్యంగానూ, నిర్భయంగానూ పరిపాలించడం...యిటువంటి కథలు చెప్పక, "పిల్లీ – జిన్నుముక్కా", "ఏడుచేపలూ" కథలు చెప్పడమే!

నాకరుపు విప్పి, తెల్లని దుప్పటి కప్పి వుంచినప్పటికీ మా అమ్మమ్మమీద అలిగి కింద పడుక్కున్నాను. "మా బాబువి కావూ! కోపం ఎందుకు బాబూ? నీకేం కథ కావాలో చెప్పు – అదే చెబతాను ఇవాళ" అన్నాది అమ్మమ్మ. కొంచెం దారిలోకి వచ్చింది కదా అని కనికరించి, చంగున గెంతే దూడలా ఒక్క గెంతు గెంతి, పక్కమీద వాలాను. నా పక్కనే కూచొని, ఆ ముసిలి వేళ్లతో నా తల నిమిరింది. 'ఏం కథ చెప్పను?' అని అడిగింది.

"మంచి కథ – ప్రజల్నీ, ఇతర దేశస్థుల్నీ అణచి పెట్టి నిరంకుశంగా రాజ్యంచేసే రాజు కథ!" అన్నాను.

దీర్ఘంగా ఆలోచించింది. నాలుగైదు కథల పేర్లు ఏకరు పెట్టింది. ఒకటీ నాకు నచ్చలేదు. ఆఖరికి ఆరంభించింది—

"అనగా అనగా ఒక ఊళ్లో ఒక పేను ఉంది."

చటాల్న లేచి అన్నాను – "ఇటువంటి కథలు నా కక్కర్లేదు!"

"ఇది చాలామంచి కథరా, బాబూ!..." అని, మళ్ళా చెప్పసాగింది.

"ఆ పేను పెసరచేను వేసుకుంది. ఎప్పుడూ లేని పెసరకాపు కాచింది ఆ ఏడాది. పేను సంతోషంతో పొంగిపోయింది. ప్రతీవాళ్ళు వచ్చి 'మన పొలంలో యింత పంట లేనేలేదు. పేను అదృష్టం బావుంది. ఎంత పంట పండిందో!" అని ఆశ్చర్యంతో అనుకుంటూ వెళ్లిపోయేవారు.

ఇలా ఉంటూండగా ఒక రోజుని ఆ ఊరి 'సామంత నిరంకుశ ప్రభువు' ఊరు చూడ్డానికని బయల్దేరాడు...ఆ రాజు అంటే మరే యితర దేశపు రాజు అయినా సరే రెండు చేతులూ జోడించి నమస్కారం చేసి, 'తమ బానిసని' అని వేడుకోవలసిందే. ఇహ ప్రజల సంగతి చెప్పనే అక్కర్లేదు.

'ఇవాళ ఎవరూ భోజనం చెయ్యకూడదు' అంటే తిండి మానేసి పస్తు వుండవలసిందే. తన నౌఖర్లకి ఇళ్ళు యిచ్చేసి అంతా ఎండలోనూ, వానలోనూ ఉండవలసిందని హుకుం జారీ అయిందంటే, గంటకో ఘడియకో ప్రాణం పోతుందన్న ముసిలి రోగిని కూడా బైట పడేయవలసిందే. దివాణానికి ఖర్చులు ఎక్కువగా వున్నాయి కాబట్టి ప్రజలంతా రూపాయికి పన్నెండణాల వొంతు చెల్లించాలి అని ఆజ్ఞాపించాడంటే అంతా కిక్కురు మనకుండా కక్కవలసిందే. అంటే ఆ నిరంకుశ ప్రభువు నోటినించి బైటకి వెడలివచ్చే ప్రతీమాటా శాసనమే అన్నమాట..."

"అయితే అమ్మామ్మా! ఎవరన్నా తిరుగుబాటు చేస్తే?" అన్నాను కథకి అడ్డు తగుల్తూ.

"రాజు మాటకి తిరుగేమిటి? ఎవరన్నా డబ్బు చెల్లించమంటే జైల్లో పెట్టేస్తారు. అప్పటికీ చెల్లిం

చక పోతే యింకా పెద్ద శిక్ష! అందుచేత ప్రతీ వాళ్ళూ ఇష్టమున్నా లేకపోయినా వొంగి వుండే వారు.

పెద్ద ఏనుగుమీద బయల్దేరాడు. ముందు సేవకులంతా నడుస్తున్నారు. ప్రజలంతా వచ్చి సాష్టాంగ నమస్కారాలు అర్పించుకుంటున్నారు. ఎవడైనా పొరపాటుచేత ఆ నిరంకుశ ప్రభువుకి నమస్కారం చెయ్యకపోతే వెంటనే వాడు తుపాకి గుండుకి గురి కావలసిందే..."

"నమస్కారం చెయ్యకపోతే అంత శిక్షా?" అని అడిగాను.

"అవును — నమస్కారం చెయ్యకపోతే ఏమిటి అర్థం? ఆ రాజు అంటే భయం లేదన్నమాట. అలా వెళ్ళగా వెళ్ళగా, ఆఖరికి పేను వుండే స్థలం చేరుకున్నారు. దాని పెసరచేను చూసి నిరంకుశ ప్రభువు ఆశ్చర్యపోయాడు. తను ఎన్నో పొలాలు చూశాడు. కాని ఎవరి పొలంలో కూడా యింత పంటలేదు. అది ఎవరి పెసరుచేనో రాజుకి తెలియలేదు. సేవకుణ్ని పిలిచి "ఇది ఎవరి పెసరు చేను?" అని అడిగాడు.

ఆ సేవకుడికి కూడా ఎవరిదో తెలియలేదు. చుట్టూ చూశాడు ఎవరన్నా ఉన్నారేమోనని. గట్టుమీద మందహాసం చేస్తూ పేను నించొని వుంది.

"ప్రభూ! పేనుయొక్క పెసరచేను" అన్నాడు సేవకుడు.

"ఏమిటీ! పేను కింత పెసరచేనా!" నిశ్చేష్టుడై పోయేడు.

"చిత్తం!" అన్నాడు సేవకుడు.

సగర్వంగా చూస్తూ తన కెదురుగా నించొని వున్న పేనుని చూశాడు రాజు. కాని పేనువచ్చి సాష్టాంగ నమస్కారాలు అర్పించుకోక పోవడమే కాకుండా, నిర్లక్ష్యపు చూపులతో నించొని వుండడం చూసి రాజుకి కోపం వచ్చింది. ఎర్రగా కళ్లు చేశాడు. కాని పేను జడవలేదు. సేవకుడు పేనుతో చెప్పాడు 'ప్రభువువారికి నమస్కారం చెయ్యి' అని. పేను కదలనూ లేదు, మెదలనూ లేదు. నిరంకుశ ప్రభువు కోపం అధికమైంది. దాన్ని బంధించి తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు. తక్షణమే సేవకులు బంధించి తీసుకువచ్చారు.

"ఎవరు నువ్వు?" ఉరుముతూ అడిగాడు సామంత ప్రభువు.

"ఈ పెసరచేను అధికారిని!" అన్నది సగర్వంగా.

కోపాగ్ని ప్రజ్వరిల్లింది. ఆ పెసరచేను ధ్వంసం చెయ్యమని హుకుం జారీ అయింది. ఒక్క క్షణంలో చేనంతా నాశనం అయిపోయింది. ప్రభువు తిరిగి వెళ్లిపోయాడు.

పేనుకి ఎంతో కోపం వచ్చింది. కాని ఏం చెయ్యగలదు? తను ఎల్లాగ భగవంతునిచేత సృష్టింపబడిన ప్రాణో, ఆ సామంత ప్రభువు కూడా అటువంటి ప్రాణే. మరి అతని కింద లొంగి వుండవలసిన అగత్యం ఏమిటి? దీర్ఘంగా ఆలోచించింది. తను చిన్న జంతువైనంత మాత్రాన, తన బలంచేత పండువంటి చేను పాడు చేయిస్తాడా? పగ ఎలా తీర్చుకోవడం? ఒక ఆలోచన తట్టింది!

◆ ◆ ◆

సాయంత్రం వేగంగా పెసరపప్పు నానవేసి, పెసరట్లుచేసి, మూటకట్టి బయల్దేరింది. స్నేహితులంతా తమ సానుభూతి తెలియపర్చారు. అందర్నీ పిలిచి పెసరట్లు పంచిపెట్టింది. తర్వాత యిలా అన్నది—

"మిత్రులారా! మీరంతా వుండికూడా ఆ మదాంధుడు నా పెసరచేను పాడుచేసేస్తుంటే నోరు మూసుకొని వూరుకున్నారు. దీనికి తగిన ప్రతి క్రియ చేస్తేనే కాని నాకు నిద్రపట్టదు. మీరంతా ఇప్పుడు సహాయంచేసి తీరాలి!" అని, తను ఎవరెవరు ఏమేమి చేయాలో చెప్పి, ఇంటికి వెళ్ళిపోయింది.

పేను స్నేహితులంతా నిర్ణీత కాలానికి వారి వారికి నియమించిన పన్లు చెయ్యడానికి బయల్దేరి వెళ్ళారు.

ఇక్కడ — ఆ సామంత నిరంకుశ ప్రభువు పేను గర్వాన్ని అణచి, ఒక పాఠాన్ని బోధపర్చేందుకుగాను తను చేసినపని తల్చుకుని తల్చుకుని హాయిగా నిద్రబోయాడు. కాని కొంచెం సేపట్లోనే చటాల్న లేచాడు. ఎందుకు లేచాడో తనకే బోధపళ్ళేదు. మళ్లా పక్కమీద వాలాడు. కాని చెప్పలేని ఆందోళన బయల్దేరింది. దిగ్గున లేచి మీసం తడుముకున్నాడు. ఇంకా ఆ నొప్పి పోలేదు. మళ్ళా చిటిక్కున ఎదో కుట్టినట్టు తెల్సుకున్నాడు. ఏమిటది? పేను — తన మీసంలోకి ఎలా వచ్చింది? ఏమీ తోచక గూట్లోని దువ్వెన

తియ్యడానికి వెళ్ళాడు. చీకటిగా వుంది. ఇలా గూట్లో చెయ్యి పెట్టగానే ఏదో వేలిమీద కుట్టింది. అమ్మో! అని కేకవేసి చూస్తుడు కదా, తేలు కొండి ఆడిస్తూ వుంది. ఒక కర్ర తీసుకు వొచ్చి దాన్ని కసితీర ముక్కలు ముక్కలుగా కొట్టాలనుకుని, మూలనున్న దుడ్డుని తియ్యడానికి వెళ్ళాడు. అలా వెళ్లాడో లేదో "బుస్" మంటూ పాము పడగ నేల కేసి కొట్టింది. హతాసుడై పోయాడు. నిలువునా ప్రాణాలు ఎగిరి పోయినట్టయింది.

మొర్రోమంటు పెరట్లోకి పరిగెత్తాడు. పందిర మీద వున్న బండరాయి 'ఠపీ'మని నెత్తిమీద పడ్డాది. గోరుచుటుమీద రోకటి పోటయింది. ఏ తెరువూ కనబడక వీధిలోకి బయల్దేరాడు. తలుపు తెర్చి చూసేటప్పటికి 'గాండ్రు'మంటూ నోరు తెరుచుకుని పెద్ద పులి నించోని వుంది. సామంత నిరంకుశ ప్రభువు కొయ్యబారి పోయాడు. ఒంటి నిండా తేళ్లూ, జెర్రులూ, పాములూ, పాకు తున్నట్టనిపించింది. పేను మరోమారు చిటుక్కున కుట్టింది. ఎటు వెళ్తాడు? ఏం చేస్తాడు ?

"నే నెవరో తెల్సునా ?" అడిగింది పేను.

అతను నీళ్లు నములుతున్నాడు.

"నీ సేవక బృందం ఏదీ? పాపం! నోటి వెంట మాట పెగల్దేం? ఒంటరిగా దొరికిన పేను మీద చూపిన నీ బలం, పౌరుషం ఇప్పు డేమిటు యాయ్? తోడి ప్రాణులమీద అధికారం చెలా యిద్దామనుకునే నీలాటి మూర్ఖుల్ని చూసి నవ్వా లో, విచారించాలో, కనికరించాలో తెలియడం లేదు. ఇహనైనా బుద్ధి తెచ్చుకుని మెలగుతావను కుంటా ను ఏం ?"

ఆ రాజు పేనుకి సమాధానం చెప్పనూ లేదు, అక్కణ్ణించి కదలనూ లేదు. చొంగ కారుస్తూ నించుని పోయాడు, అని వూరుకుంది అమ్మమ్మ. "ఐతే అమ్మమ్మా! పేనంటే, గోరుతో చిట్టుక్కున నొక్కేస్తే రక్తం కక్కుకుని చనిపోయే జంతువు కదా! అంత సామంత నిరంకుశ ప్రభువూ ఎందరో సేవకుల్ని, సైన్యాన్ని పెట్టుకుని దాన్నేం చెయ్య లేక పోయాడా?" అని ఆతృత్తగా అడిగాను. కాని దానికేం సమాధానం రాలేదు. ఎంచాత అని చూద్దును గదా, తన బొక్కి నోరు తెర్చుకుని గుర్రు తీస్తోంది.



ఇంకనూ ఉబ్బసమా?

నీకు ఇంకను ఉబ్బసమున్నయెడల "శీఘ్రంగా నయమగును" "తప్పక తగ్గించును" అనే మాయ మందుల ప్రకటనలవలన ఏల మోసపోయెదరు ?

"శ్వాస-హారి"నే ఉబ్బస నివారణకు డాక్టర్లు నిర్ణయిస్తారు. ఇది కేవలం పై పైలక్షణాల పైనేకాక మూలకారణంపైనే పనిచేసే సక్రమమైన చికిత్స. మొట్టమొదటి మోతాదు తగిలేటప్పటికి, గొంతుక లోని గురక, ఊపిరి ఆడకపోవడం మాయమవు తుంది. నీవు నిశ్చలంగా నిద్రిస్తావు; బాగా తిని అరిగించుకుంటావు. క్రమంగా పోయిన ఆరోగ్యం కుదుటబడుతుంది. ఈ లోగా నీ ఊపిరితిత్తులకు మంచిబలం కలుగును. ఉబ్బసరోగము నిన్ను పూర్తిగా విడిచిపెట్టిపోవును.

3,6,12 ఔన్సుల సీసాలు, రు. 3-6-0, రు. 5-12-0, రు. 10ల ఖరీదుకు మంచి కెమిస్టు లందరివద్ద దొరుకును.

మద్రాసు స్టాకిస్టులు :—

మెస్సర్సు: అప్పా & కో., చైనా బజార్ రోడ్డు

" శ్రీ క్రిష్ణన్ బ్రదర్స్, తంబుచెట్టివీధి,

" అమృత రత్నాకర ఫార్మసి, గోవిందప్పనాయక్ వీధి,

తయారుచేసేవారు :

డాక్టర్ పురోహిత్ ఫార్మసీ;

కొల్హాపూర్.



PUROHIT
SHWAS-HARI